# బరువు బ్రతుకు

రచన :
శ్రీ వంకదారు సాత్యకిరావు

"చావు నామీదకే రానున్నది
మనసు నీమీదకే పోవుచున్నది
కారుచీకట్లు, పగలేమూసెను,
ఆశ, పేరాశ అవబోతున్నది"

ఏమిటో పాడుకొంటూ పోతున్నాడు. ఎక్కడకో? ఎందుకో ?

అతని జీవితంలో ఒక నిగూఢమైన రహస్యం వుంది. అతని జీవనస్రవంతి, ఎత్తుపల్లాలమీదుగా, వంకరటింకరగా ప్రవహించింది. "రావు" విషాధజీవితం, అందరికీ ఆశ్చర్యాన్ని, ఆవేశాన్ని కల్గిస్తుంది. అర్థంగాని అతని గాథ, కొందరికి బాధను కల్గిస్తుంది. రావు, కమలను ప్రేమించాడు. ఆమె రావుని నిరాకరించి, మేనమామను వివాహంచేసుకొంది. అంతే !

ఇక రావూ పిచ్చివాడయిపోయాడు. ఆ పైగా 'దేవదాసు' సినిమా చూశాడు. అచ్చంగా దేవదాసులా తిరగటం ప్రారంభించాడు. దానికితోడు ప్రేమలేఖల్లోని రెండు పాటలు కంఠంతో పట్టాడు. ఇంకేముంది? భగ్నజీవిలా మారిపోయాడు!!

'కమలలో ఏమంత గొప్పదనముందని ప్రేమించావురా?' అని ఒకరోజున 'అచ్చియ్య' అడిగాడు.

అచ్చియ్య అంత వక్రంగా ప్రశ్న వేస్తాడని రావు అనుకోలేదు. కమలలో తన్నెక్కుడుగా ఆకర్షించిన వస్తువేది? రావూ ఆలోచనలో పడ్డాడు.

లేతగులాబీలాంటి ఆమె చెక్కిళ్లా, నల్లని కాటుక దిద్దిన కళ్లా; సున్నితమైన హృదయమా, ఎర్రని శరీరం మీద జాకెట్టు సిల్కుచీరతో కనుపించే ఆమె రూపమా లేక ముచ్చటైన ఆమె పేరా! సందిగ్ధంలో పడ్డాడు.

ఈ లోకంలో నిండు హృదయంతో ప్రేమించే ఒకే ఒక వ్యక్తిని, ఎందుకంతగా ప్రేమిస్తున్నావో చెప్పమంటే చెప్పలేకపోవటం, రావూకు బాధనుకల్గించింది. అంతేగాకుండా తన అశక్తత, అసమర్థత కూడ వెల్లడైంది.

'ఆమెలోని ప్రతి అవయవము నన్నాకర్షించినవి!' అని అన్నాడు చివరకు.

'ఓయ్! పిచ్చివాడా! ఆమెను ప్రేమించటానికి నీ దగ్గర అర్హతేమున్నది?' యీ ప్రశ్న రావూకు చిత్రాన్ని కల్గించింది.

అర్హతా! ప్రేమించటానికికూడా అర్హతా! ప్రేమ బజారులో అమ్మేదికాదు. కొనేదికాదు. పవిత్ర హృదయాల్లో పుట్టి స్త్రీ, పురుషుల్లో ప్రవహిస్తుంది. ఆమె స్త్రీ, నేను పురుషుణ్ణి! ఇదే అర్హత!' అన్నాడు రావూ ఉద్రేకంతో.

అయితే ఆమెకోసం నువ్వేం త్యాగంచెయ్యగలవ్?' యీ ప్రశ్న రావూ కోపానికి దారితీసింది.

'ఏంకావాలంటే అది... నా తెలివి తేటల్ని... నా జీవితాన్ని త్యాగంచేస్తాను. సరా!' అన్నాడు.

అచ్చియ్య చిరునవ్వు నవ్వి 'నీ జీవితాన్ని త్యాగం చేయమంటంలేదు. ఇప్పటి నీ పరిస్థితి చూస్తే త్వరలో అదే నిన్ను వదిలిపోయేలావుంది. అర్హత కావాలోయ్! తగిన అర్హత! వాళ్లా ధనవంతులు! నువ్వు పేదవాడివి!' అన్నాడు.

"అర్హత నాదగ్గిరేమీ లేదంటావా ? రచయితగా నాకున్న పేరు ప్రఖ్యాతి చాలదా ?" అన్నాడు రావు.

"చాలదు బ్రదర్ ! చాలదు !! ఇంతకూ నువ్వెన్ని కథలు వ్రాశావేంటి ?"

"యాభై వ్రాసాను. ముప్ఫయి అచ్చయినవి. ఇరవై తిరిగొచ్చినవి."

"ఓస్ ! ఇంతమాత్రానికేనా !" అన్నాడు అచ్చియ్య యీసడింపుగా

"ఇంకేం చేయమంటావ్ చెప్పు ?" అన్నాడు రావు జాలిగా "చేయమనేదేముంది. ఆమెకు వివాహమైపోయింది కాబట్టి ఆమెను మర్చిపో ! స్నేహితుణ్ణిగాబట్టి నేను నీకిచ్చేసలహా ఇది. రేయింబవలు ఆమెనామ

జపంతో నీ జీవితాని కెందుకు ముప్పు దెచ్చు కొంటావు ?"

"కాదు బ్రదర్! కమలకు నేనంటే ఎంతో ప్రేమ!"

"అయితేనేం! ఆమె తల్లిదండ్రుల్ని ఎదిరించి నడువ లేకపోయింది. సమాజమంటే ఏమిటో ఆమెకు పూర్తిగా అర్థంగాదు. ప్రేమ విలువ అసలే తెలవదు. డబ్బున్న భర్త దొరికాడు. అంతే; ఆమెకు కావలసింది."

అచ్చియ్య మాటలు వింటుంటే రావుకు భయం వేసింది. తాను ప్రేమించిన స్త్రీ, తనకోసమేమీ త్యాగం చేయలేక పోయిందంటే రావూ చాలా నిరుత్సాహపడ్డాడు.

"ప్రేమ విలువెటువంటిదో, సమాజంలో బ్రతుకెటు వంటిదో పూర్తిగానే నామెకు ఉత్తరంలో వ్రాసాను బ్రదర్!"

"వ్రాస్తే మాత్రం ఆమె కర్థ మయిందంటావా నీ భావనా రేఖ! ఆమె చదివిందే ఫస్టుఫారం! విజ్ఞానం ఎక్కడనుంచొస్తుంది ?"

రావు చెప్పే ప్రతిమాట అచియ్య ఖండిస్తుంటే రావూకు తన బరువు బ్రతుకుపై వ్యామోహం తగ్గిపోయింది. అక్కడనుంచి ఎక్కడికో వెళ్ళిపోయాడు.

రావు జీవితంలో మార్పు కలిగింది. నిరాశతో, నిస్పృహతో తనబాధా జీవితాన్ని తలచుకొంటూ ఎన్నో వేడి కన్నీటి బిందువులురాల్చాడు. తనలో కలిగిన మార్పువల్ల సంఘంలో ఏవిధంగా చూడబడుతున్నాడో గ్రహించుకొన్నాడు. తన బాధలన్నీ మరచిపోవటానికి మార్గమేమిటా అని ఆలోజించుకొన్నాడు. ఆనందంకోసం, ఆ చరణలను మార్చుకొన్నాడు.

సిగిరెట్ అంటే ఏమిటో ఎరుగని రావూ సునాయాసంగా సిగిరెట్ కాల్చి సాగాడు. రావూ తన బాధా జీవితాన్ని మరచిపోవటానికి దురలవాట్లకు లోనయ్యాడు. వ్యభిచారం, త్రాగుడు, జూదం, మొదలైన దురభ్యాసాలతో తన జీవితాన్ని ఇంకా అగాధంలో పడేసుకున్నాడు.

ఆ రోజున రావూ బాగా మైకంలో తూలుతూ, రైలు కట్టమీదుగా వస్తున్నాడు.

"జహాఁదీప్ జల్తాహై
వహీఁభ్రమర్ ఉడ్‌తాహై!"

అంటూ హిందీ పాట రాగంతోపాటు అందుకొన్నాడు. రావూ శరీరం స్వాధీనంలో లేదు. పాడేది బాధాన్వితమైన భగ్నజీవి పాటలు! వచ్చేది జనతా ఎక్స్‌ప్రెస్!!!

రావూ పాట అంతకంతకూ ఎక్కువవుతోంది గాని తగ్గటంలేదు. రావూ పాటకన్నా వేగంగా ఎక్స్‌ప్రెస్ వచ్చేస్తోంది. రావూలో చలనంలేదు. ఇంజన్ ఎడ తెరపిలేకుండా కూతవేస్తోంది. రావూ తప్పుకుంటాడనుకున్నారు పాపం! 'ప్రేమ-పిచ్చి' తో ప్రపంచాన్ని మరచి, దురలవాట్లతో, భస్మమయ్యే రావూకు తప్పుకొనే శక్తివుందా.

బండి సడన్‌గా ఆగిపోయింది. "అబ్బ! ఘోరం! చూడలేము!" అని బండిలోని జనమంతా కళ్ళుమూసుకొన్నారు. చలనంలేని రావూ శరీరాన్ని ఆహుతిగొని బండి ఠపేమని ఆగిపోయింది. రావూ తన బరువు బ్రతుకు నడ్వలేక యీలోకాన్నే వదిలి వెళ్ళిపోయాడు. జనతా బయలుదేరి గుప్పు, గుప్పున వెళ్ళిపోయింది. ఇంకా యీ విధంగా ఎంతమంది భగ్నజీవులను బలిగొంటుందో; ఏమో?

'కమల' రావూను కాదన్నా, అతని జీవితాన్ని చదివిన మీరైనా రెండు వేడి కన్నీటి బిందువులు రాల్చండి!!!

Edited and Published by A. N. Raghavachar, No. 32, Krishnappa Naick Tank St, Madras-1
Printed by V, Kuppuswamy Chetty at Bharathmatha Press, No 39, Anderson St, Madras-1